## క్లుప్తంగా

### విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

మద్దిపాడు: ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పలువురు విధుల్లో సోమవారం ఉదయం చేరారు. కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు సాయంత్రం ఐదు గంటల వరకు విధుల్లోకి వచ్చేవారికి అవకాశం కల్పించినట్లు ప్రాజెక్టు సీడీపీఓ ఇవాంజలిన్ తెలిపారు. విధుల్లో చేరని వారిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించే ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

మద్దిపాడు మండలంలో మొత్తం 62 సెంటర్లు ఉండగా మూడు సెంటర్లలో ఖాళీలు ఉన్నాయి. 59 మంది కార్యకర్తల్లో 19 మంది తిరిగి విధుల్లో చేరగా 40 మంది విధుల్లో చేరలేదు. హెల్పర్లు 24 మంది విధులకు రాగా, 36 మంది సమ్మెలో ఉన్నారు.

సంతనూతలపాడు మండల పరిధిలో మొత్తం సెంటర్లు 56 సెంటర్లు ఉండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. వర్కర్లు 8 మంది విధుల్లో చేరారు. 50 మంది హెల్పర్లకు గాను ఐదుగురు విధుల్లో చేరగా మిగిలిన వారు సమ్మెలో ఉన్నారు. చీమకుర్తి మండలంలో మొత్తం 81 సెంటర్లు ఉండగా 22 మంది వర్కర్లు విధుల్లో చేరారు. హెల్పర్లు 14 మంది విధుల్లో చేరగా మిగిలిన వారు సమ్మెలో పాల్గొన్నారు. నాగులుప్పలపాడు పరిధిలో 87 సెంటర్లు ఉండగా 23 మంది వర్కర్లు, 25 మంది హెల్పర్లు విధుల్లో చేరారు, మిగిలిన వారు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈక్రమంలో జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సమ్మెలో పాల్గొంటున్న వారిని విధుల నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### నేడు విభిన్న ప్రతిభావంతుల జాబ్‌మేళా

ఒంగోలు సెంట్రల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి ఉపాధి కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు పలు రకాల ఉద్యోగాల నియామకానికి మంగళవారం ఒంగోలులో జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకురాలు జి.అర్చన తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం పది గంటల నుండి మూడు గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, పది ఆపైన విద్యను అభ్యసించిన విభిన్న ప్రతిభావంతులు మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.1.20 లక్షల నుంచి రూ.3.10 లక్షల వరకు వేతనం ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 7989244381, 9160797311 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# సంతనూతలపాడులో పెరిగిన ఓటర్లు

- 2019 జనవరిలో 2,01,059 ఓటర్లు ఉండగా ఇప్పుడు 2024 జనవరిలో 2,12,357కు పెరిగిన ఓటర్లు
- గత ఎన్నికల ఓటర్లతో పోలిస్తే 5.6 శాతం అంటే 11,298 ఓటర్లు పెరుగుదల


ఓటర్ల వివరాలను వెల్లడిస్తున్న ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.వరకుమార్

చీమకుర్తి: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో 2024 జనవరి 22 నాటికి 2,12,357 మంది ఓటర్లు ఉన్నట్లు ఎలక్ట్రోరల్ అధికారి ఎస్.వరకుమార్ ప్రకటించారు. సోమవారం చీమకుర్తి రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పీ.మధుసూదన్‌రావు డీటీలతో కలిసి నియోజకవర్గంలోని చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోని మొత్తం 256 పోలింగ్ బూత్‌లలో ఓటర్ల వివరాలను ప్రకటించారు. దాని ప్రకారం పురుషులు 1,04,408 మంది కాగా, మహిళలు 1,07,944 మంది, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 5 మందిగా ధ్రువీకరించారు.

2019 జనవరిలో సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓటర్లు 2,01,059 మంది కాగా వారిలో పురుషులు 99,666 మంది, మహిళలు 1,01,383 మంది, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 10 మంది ఉన్నారు. 2019 జనవరి ఓటర్ల సంఖ్యతో పోలిస్తే గడిచిన ఐదేళ్లలో 11,298 మంది ఓటర్లు పెరుగుదల నమోదైంది. ఇది గత ఏడాది ఓటర్లలో 5.16 శాతం పెరుగుదల కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే పురుషులు, మహిళలు ఓట్లు పెరగగా ట్రాన్స్‌జెండర్ ఓటర్లు మాత్రం 10 మంది నుంచి 5 ఓట్లకు తగ్గుదల కనిపించింది. ఓటర్ల వివరాలను పట్టిక రూపంలో ఈ విధంగా ఉన్నాయి

**సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల వివరాలు:**

| సంవత్సరం | పురుషులు | మహిళలు | ట్రాన్స్‌జెండర్‌లు | మొత్తం |
|---|---|---|---|---|
| 2024 | 1,04,408 | 1,07,944 | 05 | 2,12,357 |
| 2019 | 99,666 | 1,01,383 | 10 | 2,01,059 |
| పెరుగుదల | 4,742 | 6,561 | –5 | 11,298 |

**ఓటు నమోదు చేసుకునే వారికి మరొక్క అవకాశం:** ఇప్పటి వరకు నమోదైన ఓటర్ల వివరాల జాబితాలను నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచురించినట్లు ఈఆర్‌ఓ వరకుమార్ తెలిపారు. ఇంకా ఓటు నమోదు చేసుకోవాల్సిన వారు 18 సంవత్సరాలు ఆపైన వయస్సు ఉన్న వారు ఉంటే ఫారం 6లో వివరాలు నింపి దగ్గరలో ఉన్న బీఎల్‌ఓలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. లేదా ఎన్‌వీఎస్‌పీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో వారి ఓటర్లను నమోదు చేసుకోవచ్చని వరకుమార్ తెలిపారు.

## మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఫలాలు దక్కాలి


ప్రకాశం భవనం వద్ద మాట్లాడుతున్న హుస్సేన్‌బీ

ఒంగోలు: మహిళలకు 50శాతం రిజర్వేషన్ ఫలాలు దక్కాలని ముస్లిం జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షురాలు షేక్ హుస్సేన్‌బీ అన్నారు. సోమవారం ఇస్లాంపేట వద్ద నుంచి పలువురు మహిళలు కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం హుస్సేన్‌బీ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ విషయంలో అన్ని పార్టీలు సహకరించాలన్నారు. మహిళలపై, చిన్నారులపై జరిగే అత్యాచారాలపై కఠిన శిక్షలు వేగవంతంగా ఉండాలన్నారు. దిశ పోలీసుస్టేషన్లను మండల ప్రాంతాలకు కూడా విస్తరించాలని, మహిళా కార్పొరేషన్ ఏర్పాటు, మహిళా సాంస్కృతిక భవన్ నిర్మించడంతోపాటు ఈవ్‌టీజింగ్ నిరోధానికి అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం జాగరణ్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బుజ్జి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ, ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేఘావత్ సుగ్రీవ నాయక్, సయ్యద్ నసీమా, మౌలానా అఫ్ మురాది తదితరులు పాల్గొన్నారు.

## రాంలల్లా ప్రతిష్ఠ సందర్భంగా స్వామివారి కల్యాణం


మద్దిపాడులో సీతారాముల కల్యాణం నిర్వహించిన దృశ్యం

మద్దిపాడు: అయోధ్యలో రాంలల్లా ప్రతిష్ఠా కార్యక్రమం సందర్భంగా మద్దిపాడులో జన్నాభట్ల శ్రీనివాసరావు పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో మొక్కపాటి ఫణీంద్ర శర్మ, శారదా రాణి దంపతులు సీతారాముల కల్యాణానికి ఉభయం అందించారు. ఉభయ దాతలు కన్యా దానం చేయగా గుంటూరు నుంచి వచ్చిన వేద పండితులు సీతారామ కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. మండల కేంద్రంలో పలువురు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. స్వామివారి కల్యాణం అనంతరం ఐదు వందల మందికి అన్నప్రసాద వితరణ చేశారు.

# అభివృద్ధి పనులకు భూమిపూజ


కేశవరాజు కుంటలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ తెల్లపల్లి ధనలక్ష్మి

ఒంగోలు సబర్బన్: నగరంలోని పలు అభివృద్ధి పనులకు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత సోమవారం భూమిపూజ చేశారు. ఈ మేరకు రెండో డివిజన్‌లోని కేశవరాజు కుంట పరిధిలోని చిన్న మల్లేశ్వర కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా చిన్న మల్లేశ్వర కాలనీలోని పార్కు అభివృద్ధి పనులకు, పచ్చదనం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణ పనులకు ఎస్ క్యాప్ నిధులు రూ.15 లక్షలు వెచ్చిస్తున్నారు. కార్యక్రమంలో రెండో డివిజన్ కార్పొరేటర్ తెల్లపల్లి ధనలక్ష్మీ గాంధీ, కాంట్రాక్టర్ వెంకట రమణారెడ్డి, మున్సిపల్ డీఈ రఘురాం, ఏఈ సౌజన్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## కులగణన సర్వే తనిఖీ


ఈతముక్కల-2 సచివాలయంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుజాత

కొత్తపట్నం: మండలంలో నాలుగు రోజులుగా జరుగుతున్న కులగణన సర్వేను ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈతముక్కల సచివాలయం-2 పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఎంత మందికి చేశారు, ఎలా చేస్తున్నారు, మీకు ఏమైనా సమస్యలు ఎదురౌవుతున్నాయా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం సమయంలో సర్వర్‌ను బాగా వస్తుందని, అప్పుడే ప్రజలు ఇంటి వద్దే ఉంటారన్నారు. తప్పులు లేకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 28వ తేదీ నాటికి నూరుశాతం చేయాలని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నితిన్, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులకు అవార్డుల ప్రదానం


అవార్డులు అందుకున్న చిన్నారులు

ఒంగోలు మెట్రో: వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన చిన్నాలకు అవార్డులను ప్రదానం చేశారు. లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా, టీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని శర్మ కళాశాలలో జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం నిర్వహించారు. శివసాయి నాట్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. సుమారు 70 మంది చిన్నారులకు నంది, నటరాజ్, సరస్వతి పురస్కారాలు అందజేశారు. సంఘ సేవకుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ కళలు సమాజాన్ని చైతన్యపరిచే ఈ చిన్నారులు నృత్యం ద్వారా మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తేటతెల్లం చేశారని అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు బుచ్చేశ్వరరావు, డాక్టర్ కొలకలూరి రవిబాబు, మెప్మా పీడీ టి .రవికుమార్, శివసాయి నాట్యమండలి గురువు కొప్పుల పావని చైతన్య, దోస్తీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు షేక్ మహబూబ్, మహిళ నాయకురాలు మండవ లావణ్య, ఆళ్ల సీతామహాలక్ష్మి, కోసూరి శ్రీదేవి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మద్దాలి మాధవరావు, షేక్ నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ ఆసరా విజయవంతంగా నిర్వహించాలి


వెంకాయమ్మను సత్కరిస్తున్న అధికారులు

దర్శి: ఈ నెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే వైఎస్సార్ ఆసరా పథకాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక బూచేపల్లి నివాసంలో ఎంపీడీఓ, ఏపీఎం, సీసీలతో వారు సోమవారం సమావేశమయ్యారు. వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని చెప్పారు. మూడు విడతలు పూర్తి చేసుకుని నాలుగో విడత రుణమాఫీని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నేడు నగదు డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. నగర పంచాయతీ కమిషనర్ మహేష్, దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు ఎంపీడీఓలు హనుమంతరావు, కుసుమకుమారి, యుగకీర్తి, శంకరరావు, ఏపీఎంలు విజయకుమారి, గుడిమెట్ల వెంకటేశ్వర్లు, దేవరాజు, హనుమంతరావు, సీసీలు బ్రహ్మయ్య, ఫణిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


కొత్తపట్నంలో సీతారాముల కల్యాణం


శోభాయాత్రగా రామాలయాల్లో పూజలు నిర్వహిస్తున్న సమరత సేవా మహిళలు

# బాలరాముడికి మంగళ నీరాజనాలు


గద్దలగుంట పార్కు సమీపంలో ఇంటి ముంగిట ముగ్గువేసి రామమందిరం ఫొటో పెట్టి పూజ చేస్తున్న బెంగాలి మహిళలు

ఒంగోలు మెట్రో: అయోధ్యలో రామ మందిరం విగ్రహ ప్రతిష్ట సందర్భంగా జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కోట్లాది మంది ప్రజలు ఎదురుచూస్తున్న శుభ తరుణం రానే వచ్చింది. సోమవారం మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో అయోధ్యలో ప్రారంభమైన బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లాలోని యావత్ ప్రజానీకం నీల మేఘశ్యామునికి మంగళ నీరాజనాలు అర్పించారు. ఈ సందర్భంగా ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వీధులు గృహాలు, వ్యాపార సముదాయాలు కాషాయ దండతో రెపరెపలాడాయి. ముఖ్యంగా ఒంగోలు నగరం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. విగ్రహ ప్రతిష్ట జరిగే సమయంలో జై శ్రీరాం నినాదాలు మిన్నంటాయి. ప్రతి ఇంట్లో ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజులపాటు నియమ నిష్టలతో దేవాలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అయోధ్యలో ప్రతిష్ట పూర్తి కాగానే ప్రతి ఇంట్లో అయోధ్య అక్షతలను చల్లించుకొని పూజలు చేశారు. సాయంత్రం అందరూ ఇళ్ల వద్ద ఐదు దీపాలు వెలిగించి బాల రామునికి మంగళ నిరాజనాలు ఇచ్చారు. నగరంలోని వాడవాడలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ క్లబ్ సిటిజన్ సహకారంతో యువకులు సీతారామ ఆంజనేయ వేషధారణతో కాషాయ జెండాలు పట్టుకొని జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పార్వతమ్మ గుడి, పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల, గాంధీ రోడ్డు ప్రాంతాల్లో బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ఆవరణలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సీతారాముల కళ్యాణం, హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం వైభవంగా నిర్వహించారు. అనంతరం పద్మ విభీషణ్ కేశవ పరాశరన్ మాజీ అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా వారిచే కోర్టుహాలు ప్రారంభించారు. అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో వారం రోజులుగా భక్తుల రద్దీ పెరిగింది. ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. ధార్మిక ప్రవచకులు నేమ్మాని సీతారామమూర్తి మాట్లాడుతూ శ్రీరాముడు భారతీయుల ఆత్మగా పేర్కొన్నారు. ప్రజలను కన్న బిడ్డలుగా పాలించిన రామరాజ్యం వైభవాన్ని గుర్తు చేసుకున్నారు. రామ మందిరాలలో వివిధ రకాల ప్రసాదాలతో స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు.

**సమరత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..**

అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా సమరత సేవ ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరంలోని రామ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మంగమూరు రోడ్డు, గాంధీనగర్ మూడో లైన్ రామలింగేశ్వర స్వామి దేవాలయం నుంచి 50 మంది మహిళలు శోభాయాత్రగా బయలుదేరి వడ్డివానికుంట ఉన్న రామాయం, ఐశ్వర్యనగర్లో ఉన్న రామాలయంలో, పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల గడియారం వారి వీధిలో అనంత కోదండ రామ స్వామి మందిరం, గాంధీరోడ్డులో ఉన్న అనంత కోదండ రామాలయంలో సీతారాముల స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో భువనేశ్వరి, పద్మావతి, కుమారి, రాణి, పద్మావతి, తీగల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వారం రోజుల పాటు ప్రతి రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గాదెపాలెం, మోటుమాల, కొత్తపట్నం, ఈతముక్కల, అల్లూరులో ఉన్న రాముడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా శ్రీరాముడుకు కల్యాణమహోత్సవం నిర్వహించారు. భక్తులు అధికంగా పాల్గొని తిలకించారు. భజనలు చేశారు. రాముడు అయోధ్యలో జన్మించిన సంఘటనలు, రాముడి జీవిత చరిత్ర గురించి వివరించారు. రాధామనోహర్ దాస్ హిందూ జనశక్తి లలితకుమర్, శివశక్తి కల్యాన్ కుమార్, ఒంగోలు నుంచి వచ్చిన జ్ఞానసింధు, శ్రీరామచంద్రమూర్తి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, విష్ణు, జి.విష్ణు, శివప్రసాద్, టీపీ అధ్యక్షుడు మనోహర్ పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్ లేకుంటే చర్యలు


తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో వివిధ వ్యాపార సంస్థలు, మాల్స్, కిరాణా, ఫ్యాన్సీ షాపులు నిర్వహిస్తున్న వారు ట్రేడ్ లైసెన్స్ పొందాలని, లేని వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని వివిధ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి లైసెన్స్‌ను పరిశీలించారు. లేని వారు సచివాలయాల్లో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన వస్తువులను అమ్మినవారిపై, 120 మైక్రాన్ మందం కంటే తక్కువ కలిగిన ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. షాపుల ముందు కాలువల్లో చెత్తా చెదారం వేయవద్దని, పారిశుధ్య కార్మికులకు సహకరించాలని చెప్పారు.

## శింగరకొండలో ప్రత్యేక పూజలు


తులసీదళాల అర్చనలో స్వామివారు

అద్దంకి రూరల్: అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలకు తులసీదళాలతో అర్చన నిర్వహించారు. శ్రీరామ కీర్తనలతో భజనా కార్యక్రమం చేపట్టారు. పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ టి. సుభద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# బైకు అదుపుతప్పి అన్నదమ్ములకు గాయాలు


ఘటనా స్థలంలో పడిఉన్న క్షతగాత్రులు

మేదరమెట్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో అన్నదమ్ములిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల బైపాస్ రోడ్డుపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం పర్చూరు గ్రామానికి చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు, పాలపర్తి రాంబాబు అన్నదమ్ములు మోటారు బైకుపై పర్చూరు నుంచి నెల్లూరుకు బయలుదేరారు. మార్గ మధ్యంలో మేదరమెట్ల జాతీయ రహదారి వద్ద బైకు అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లి పడ్డారు. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు, ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## రహమతున్నిసాకు డాక్టరేట్


రహమతున్నిసా

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న షేక్ రహమతున్నిసా హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పొందారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ ఎ.పత్రిక్ ఆధ్వర్యంలో జీవిత బీమా కంపెనీల మార్కెటింగ్ వ్యూహాలపై ఆమె అధ్యాయనం చేశారని ఆయన పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన రహమతున్నిసాను ప్రిన్సిపాల్‌తో పాటు తోటి అధ్యాపకులు అభినందించారు.

## పోగొట్టుకున్న బైక్ అప్పగింత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రేడియోబావి సమీపంలో పట్టణానికి చెందిన బాలీశ్వరయ్య అనే వ్యక్తి తన బైక్ పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు స్థానిక ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకుని బాధితుడి బైక్‌ను సీసీ కెమెరాల ఆధారం కనుగొని బాధితుడికి సోమవారం అప్పగించాడు. పట్టణంలోని బైక్‌లను దొంగలించే వ్యక్తులు సంచరిస్తున్నట్లు ప్రజలు అప్రమత్తంగా మెలగాలన్నారు. బైక్‌లకు తప్పకుండా తాళాలు వేయాల్సిందిగా ఆయన కోరారు.